

RNI: APTEL/2010/36742

# న్యూస్ వార్

వార్తా పత్రిక

నల్లగొండ | epaper.news war.com | శనివారం 28, మార్చి 2026 | సంపుటి :16 సంచిక :10 | ఎడిటర్: నటవా కృష్ణారావు | పేజీలు : 4 , వెల.2.00

TELANGANA RISING GLOBAL SUMMIT



## అంగరంగ వైభవంగా కల్యాణ మహోత్సవం



**భద్రాద్రి రాముల వారి కల్యాణ మహోత్సవానికి హాజరైన సీఎం రేవంత్ రెడ్డి..**

భద్రాద్రి రాములవారి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. లక్షల మంది భక్తులు ఆలయానికి చేరుకుని పెళ్లి వేడుకను కనులవిందుగా తిలకించారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్ర మార్క, మంత్రి పొంగలేటి సహా పలువురు ప్రముఖులు వేడుకలో పాల్గొన్నారు. ఇవాళ(శుక్రవారం) ఉదయం బేగంపేట విమానాశ్రయం నుంచి కుటుంబసమేతంగా సారపాక హెలిప్యాడ్‌కు చేరుకున్నారు రేవంత్.

వార్త 2లో



## ఎరువుల కొరత లేదు, ఆందోళన వద్దు: లోక్‌సభలో జేపీ నడ్డా

పశ్చిమాసియాలో ఘర్షణలు కారణంగా ఎరువులు, ముడి పదార్థాల రవాణాలో ఆలస్యం చోటుచేసుకుని రైతులు ఇబ్బందులు పడుతున్నారంటూ వస్తున్న వార్తలపై కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి జేపీ నడ్డా లోక్‌సభలో స్పందించారు. ఎరువులపై యుద్ధ ప్రభావం పడకుండా రైతుల అవసరాలకు సరిపడా సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు.

వార్త 2లో

## శ్రీరాముడు ధర్మానికి.. సీతమ్మ పవిత్రతకు ప్రతీక



శ్రీరాముడు ధర్మానికి.. సీతమ్మ తల్లి పవిత్రతకు ప్రతీక అని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అభివర్ణించారు. భారతీయ సంస్కృతిలో రామాయణం విశిష్టమైనదని తెలిపారు. రామాయణంలో ఆదర్శ పుత్రుడు, భర్త, పురుషుడిగా నిలబడిన శ్రీరాముడిని స్ఫూర్తిగా తీసుకోవాలని ఈ సందర్భంగా ప్రజలకు ఆయన సూచిం చారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సీతారాంబాగ్ ఆలయం వద్ద శ్రీరామ శోభయాత్రను గవర్నర్ జెండా ఊపి ప్రారంభించారు.

వార్త 2లో



**కొరతకు కారణం చమురు కంపెనీలే..** 2


## కవిత కొత్త పార్టీకి ముహూర్తం ఖరారు..

### ఏప్రిల్ 25న జెండా ఆవిష్కరణ



నూతన రాజకీయ పార్టీపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కీలక ప్రకటన చేశారు. ఏప్రిల్ 25న ఉదయం 10 గంటలకు కొత్త పార్టీని స్థాపించనున్నట్లు తెలిపారు. మేడ్చల్‌లోని మునీరాబాద్ వద్ద అద్వయ ఫంక్షన్ హాలులో జెండా ఆవిష్కరణ చేస్తామని ప్రకటించారు. ఆ సమయంలోనే పార్టీ పేరును కూడా ప్రకటించనున్నట్లు తెలిపారు. కార్యకర్తలంతా సమయానికి చేరుకోవాలని, ప్రతి గ్రామం నుంచి తరలిరావాలని కవిత పిలుపునిచ్చారు.

వార్త 2లో



## 50 శాతం వాణిజ్య విమానాల్లో సాంకేతిక లోపాలు: స్టాండింగ్ కమిటీ ఆన్ సివిల్ ఏవియేషన్


వార్త 2లో

## వేములవాడలో రాములోరిని దర్శించుకున్న పొన్నం

**వేములవాడ:**

శ్రీ రామనవమి సందర్భంగా వేములవాడలోని భీమేశ్వరాలయంలో స్వామివారిని మంత్రి పొన్నం ప్రభాకర్ కుటుంబం సమేతంగా దర్శించుకున్నారు. తెలంగాణ ప్రజలకు పొన్నం శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపారు. శ్రీరామ నవమి సందర్భంగా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి సన్నిధిలో భీమేశ్వరాలయంలో స్వామివారిని దర్శించుకోవడం జరిగిందన్నారు. యావత్ దేశ వ్యాప్తంగా రాములోరి పెళ్లి అంటే లోక కల్యాణం కోసం సర్వేజనా సుఖినోభవంతు అని వేడుకగా జరిగే కళ్యాణ ఉత్సవాలు అని కొనియాడారు. శ్రీరామనవమి సందర్భంగా స్వామివారి ఆశీస్సులతో రాష్ట్రమంతా సమృద్ధి వర్షాలతో పాడిపంటలతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని, ప్రజా పాలన ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలు ఎలాంటి అవరోధాలు లేకుండా ముందుకు సాగాలని ఆ భగవంతుడిని వేడుకున్నారు. పొన్నం ప్రభాకర్ వెంట ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కూడా ఉన్నారు.





2

**అయోధ్యలో అద్భుతం: బాలరాముడి నుదుటిపై 'సూర్య తిలకం'**

## అయిల్ కంపెనీలకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త



**ఢిల్లీ:**

ఆయిల్ కంపెనీలకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. పెట్రోల్, డీజిల్‌పై అదనపు ఎక్సైజ్ డ్యూటీ తగ్గించాయి. పెట్రోల్‌పై లీటర్‌కు రూ.10 మోడీ ప్రభుత్వం తగ్గించింది. డీజిల్‌పై దీనినిపూర్తిగా ఎత్తివేసింది. గతంలో పెట్రోల్‌పై లీటరు రూ.13 ఎక్సైజ్ సుంకం ఉండగా ఇప్పుడు 10 రూపాయలు తగ్గించి మూడు రూపాయలు చేశారు. డీజిల్‌పై పది రూపాయలు ఉండగా జీరోకు చేశారు. ప్రపంచవ్యాప్తంగా ముడిచమురు సరఫరా సంక్షోభం కొనసాగుతున్న సమయంలోనే పెట్రోల్, డీజిల్ ధరలను కేంద్ర ప్రభుత్వం తగ్గించింది. దీని వల్ల వినియోగదారులకు ధరలు తగ్గే అవకాశం లేదు. అంతర్జాతీయ మార్కెట్లో పెరిగిన క్రూడ్ ఆయిల్ ధరల వల్ల నష్టాల్లో ఉన్న ఆయిల్ కంపెనీలకు ఉపశమనం కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వ నిర్ణయం తీసుకుంది. ఆయిల్ కంపెనీలపై ఒత్తిడి తగ్గిస్తూ రిటైల్ ధరలు పెంచే అవసరాన్ని తగ్గించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో ముడి చమురు ధరలు భారీగా పెరుగుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రిఫైనరీలు విదేశాలకు ఎగుమతి చేసే పెట్రోల్, డీజిల్‌పై పన్ను విధించింది.

# అంగరంగ వైభవంగా కల్యాణ మహోత్సవం

## శ్రీరాముడు ధర్మానికి.. సీతమ్మ పవిత్రతకు ప్రతీక: తెలంగాణ గవర్నర్

హైదరాబాద్, న్యూస్‌వార్ ప్రతినిధి

శ్రీరాముడు ధర్మానికి.. సీతమ్మ తల్లి పవిత్రతకు ప్రతీక అని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అభివర్ణించారు. భారతీయ సంస్కృతిలో రామాయణం విశిష్టమైనదని తెలిపారు. రామాయణంలో ఆదర్శ పుత్రుడు, భర్త, పురుషుడిగా నిలబడిన శ్రీరాముడిని స్ఫూర్తిగా తీసుకోవాలని ఈ సందర్భంగా ప్రజలకు ఆయన సూచించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సీతారాంబాగ్ ఆలయం వద్ద శ్రీరామ శోభయాత్రను గవర్నర్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి నగరంలో శ్రీరామ శోభాయాత్ర, కల్యాణోత్సవం విశేషంగా నిర్వహించడం అభినందనీయమ న్నారు. శోభాయాత్ర భక్తుల ఐకమత్యానికి నిదర్శనంగా నిలుస్తుందన్నారు. శోభాయాత్రలో పాల్గొనే భక్తుల ఆధ్యాత్మికత ఉత్సాహం.. నగర వాతావరణాన్ని ఆధ్యాత్మిక భావనలో నిలుపుతుందని గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా చెప్పారు. సీతారాంబాగ్‌లో ప్రారంభమైన శ్రీరామ శోభాయాత్ర రాత్రి 10 గంటలకు సుల్తాన్ బజార్‌లోని హనుమాన్ వ్యాయామశాల వద్ద ముగుస్తుంది. ఈ శోభాయాత్ర జరిగేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఇప్పటికే నగర సీపీ సజ్జనార్ తెలిపారు. దాదాపు 3 వేల మందితో పటిష్టమైన బందోబస్తు మధ్య ఈ యాత్ర సాగనుంది. దాదాపు లక్ష మంది భక్తులు ఈ శోభాయాత్రలో పాల్గొనున్నారు. ఈ యాత్ర సాగే ప్రాంతంలో సీసీ టీవీ కెమెరాలు, డ్రోన్ల పహరాలో ఈ యాత్ర కొనసాగుతోంది.

## భద్రాద్రి రాముల వారి కల్యాణ మహోత్సవానికి హాజరైన సీఎం రేవంత్ రెడ్డి..

భద్రాద్రి కొత్తగూడెం: న్యూస్‌వార్ ప్రతినిధి



భద్రాద్రి రాములవారి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. లక్షల మంది భక్తులు ఆలయానికి చేరుకుని పెళ్లి వేడుకను కనులవిందుగా తిలకించారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగలేటి సహా పలువురు ప్రముఖులు వేడుకలో పాల్గొన్నారు. ఇవాళ(శుక్రవారం) ఉదయం బేగంపేట విమానాశ్రయం నుంచి కుటుంబసమేతంగా సారపాక హెలిప్యాడ్‌కు చేరుకున్నారు రేవంత్. అనంతరం రోడ్డుమార్గాన భద్రాద్రి రాములవారి ఆలయం వద్దకు వెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున స్వామిఅమ్మవార్ల వివాహ మహోత్సవానికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ఉదయం 11:35 నుంచి మధ్యాహ్నం 12:25 వరకు మిథిలా స్టేడియంలో జరిగిన శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం సారపాక హెలిప్యాడ్ నుంచి హైదరాబాద్‌కు తిరిగి బయలుదేరారు సీఎం రేవంత్ రెడ్డి. కాగా, ఈ వేడుకను చూసేందుకు తెలుగు రాష్ట్రాల ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. రాములోరి నామస్మరణలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది.

## ఎరువుల కొరత లేదు, ఆందోళన వద్దు: లోక్‌సభలో జేపీ నడ్డా

న్యూఢిల్లీ: న్యూస్‌వార్ ప్రతినిధి

పశ్చిమాసియాలో ఘర్షణలు కారణంగా ఎరువులు, ముడి పదార్థాల రవాణాలో ఆలస్యం చోటుచేసుకుని రైతులు ఇబ్బందులు పడుతున్నారంటూ వస్తున్న వార్తలపై కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి జేపీ నడ్డా లోక్‌సభలో స్పందించారు. ఎరువులపై యుద్ధ ప్రభావం పడకుండా రైతుల అవసరాలకు సరిపడా సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని కోరారు. ఔషధాల తయారీకి ఇతర దేశాల నుంచి ముడిసరుకు దిగుమతిపై ఆధారపడటాన్ని తగ్గించుకునేందుకు కూడా చర్యలు చేపట్టామని చెప్పారు. ముడిసరుకుల దిగుమతి విషయంపై ఒక్క దేశం పైనే ఆధారపడకుండా ప్రత్నామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నామని, ఇప్పటికే పలు దేశాలతో దీర్ఘకాలిక ఒప్పందాలు చేసుకున్నామని నడ్డా వివరించారు. ఔషధాల తయారీకి ఇతర దేశాల నుంచి ముడిసరుకు దిగుమతిపై ఆధారపడటాన్ని తగ్గించుకునేందుకు కూడా చర్యలు చేపట్టామని చెప్పారు. దీనికిముందు, పశ్చిమాసియాలో పరిస్థితిపై సమీక్షించేందుకు కేంద్ర మంత్రివర్గం మంగళవారం సమావేశమైంది. ఇందులో ప్రధానంగా ఎరువుల లభ్యత, సరఫరాపై చర్చించారు. ఖరీఫ్ సీజన్ వరకూ ఎలాంటి కొరత లేదని, రైతుల అవసరాలకు సరిపడా సరఫరా చేయగలమని సమావేశం ఒక నిశ్చితాభిప్రాయానికి వచ్చినట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. అయితే పశ్చిమాసియాలో సంక్షోభం ఇలాగే కొనసాగితే ఎరువుల ఉత్పత్తి 0.6 నుంచి 0.9 మిలియన్ టన్నుల మేరకు తగ్గే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఈ సమావేశంలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్, పెట్రోలియం మంత్రి హర్దీప్ సింగ్ పురి, ఆరోగ్య, ఎరువుల శాఖ మంత్రి జేపీ నడ్డా తదితరులు పాల్గొన్నారు.

## కొరతకు కారణం చమురు కంపెనీలే..

హైదరాబాద్, న్యూస్‌వార్ ప్రతినిధి

పొద్దున లేచి ఉద్యోగానికి వెళ్లాలంటే సగటు పౌరుడు బైక్‌లో పెట్రోల్ పోయించుకొనేందుకు పోరాటం.. ఓ ఆటోవాలా తన ఆటోతో ట్రిప్పులకు వెళ్లాలన్నా పెట్రోల్ కోసమో, సీఎన్జీ కోసమో ఆరాటం.. చిన్న వదంతులే పెద్ద విపత్తులకు దారితీస్తున్న ప్రస్తుత కాలంలో సగటు పౌరుడు బతుకు బండి లాగటానికి నిత్యం కష్టాలు పడుతుంటే.. లేని ఈ సంక్షోభాలే కొందరికి అద్భుత ఆదాయ మార్గాలుగా మారుతున్నాయి. దేశంలో ఎక్కడా పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ కొరత లేదని ప్రభుత్వం పదేపదే చెబుతున్నా.. పెట్రోల్, గ్యాస్ బంకుల వద్ద అవే క్యూలు కనిపిస్తున్నాయి. వంటగ్యాస్ సిలిండర్ల కోసం కొన్నిచోట్ల ఏకంగా దొమ్మీలే జరుగుతున్నాయి. దీనికంతటికీ ప్రభుత్వాల నిర్లక్ష్యంతోపాటు క ంపెనీల స్వార్థమే కారణమనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రస్తుత ఇంధన సమస్యలకు చమురు కంపెనీల తీరే కారణమని తెలుస్తోంది. పరిస్థితులను అర్థంచేసుకోకుండా రుణ పరిమితిని ఎత్తివేసి, డబ్బు చెల్లిస్తేనే పెట్రోల్, డీజిల్ ట్యాంకర్లు నింపుతామని కంపెనీలు మొండికేస్తుండటం వల్లే ఈ సమస్య వచ్చిందని కొందరు డీలర్లు చెబుతున్నారు.

### ముక్కుపిండి వసూలు

రాష్ట్రంలో ప్రతిరోజూ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐవోసీఎల్), భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్), హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్) కంపెనీలు సగటున 13 నుంచి 14 వేల కిలోలీటర్ల పెట్రోల్, డీజిల్‌ను సరఫరా చేస్తుంటాయి. దీంట్లో పెట్రోల్ 5 వేల నుంచి 6 వేల కిలో లీటర్లు, డీజిల్ 7 వేల నుంచి 8 వేల కిలో లీటర్లు ఉంటుంది. ఈ పెట్రోల్, డీజిల్ సరఫరా చేయటానికి చమురు కంపెనీలు రుణ పరిమితి పద్ధతి (క్రెడిట్ లిమిట్ సిస్టమ్) అమలుచేసేవి. అంటే పెట్రోల్ బంకుల డీలర్లకు ముందుగా పెట్రోల్, డీజిల్ సరఫరా చేసి... అది విక్రయించిన తర్వాత డబ్బు తీసుకునేవి. బీపీసీఎల్ నెల వరకు అవకాశం ఇచ్చేది. ఐవోసీఎల్ తక్కువలో తక్కువగా 5 రోజుల సమయం ఇచ్చేది. హెచ్‌పీసీఎల్ కూడా డీలర్లకు క్రెడిట్ లిమిట్ ఇస్తుంటుంది. సాధారణ రోజుల్లో రుణ పరిమితితో సరఫరా చేసే ఈ కంపెనీలు.. ఏదైనా విపత్తు వచ్చినప్పుడు విశ్వరూపం చూపిస్తున్నాయి. అమెరికా- ఇరాన్ యుద్ధంతో ప్రజల్లో చమురు భయాలు నెలకొన్న ఈ సమయంలో చమురు కంపెనీలు రుణ విధానాన్ని ఎత్తివేశాయి. గత వారం నుంచి పెట్రోల్ బంకుల డీలర్లు ముందస్తుగా డబ్బులు చెల్లిస్తేనే ట్యాంకర్లు నింపి పంపిస్తున్నాయి. ప్రతిరోజూ మధ్యాహ్నం 3 గంటల లోపు డీలర్లు డబ్బులు చెల్లిస్తేనే... ఆ రోజు రాత్రిగానీ, మరుసటి రోజు ఉదయం గానీ ట్యాంకర్లు పంపిస్తున్నాయి. సాధారణ రోజుల్లో చమురు కంపెనీలు వద్దంటే సరఫరా చేస్తున్నాయి. డీలర్లు ఆర్డర్ పెట్టినా, పెట్టకపోయినా ట్యాంకర్లు పంపిస్తున్నాయి.



ఉక్రెయిన్ - రష్యా యుద్ధం, కోవిడ్ సమయంలో కూడా ఇలాగే చేశాయి. దీంతో సకాలంలో డబ్బు చెల్లించలే ని డీలర్లు పెట్రోల్ బంకుల్లో ఉన్న చమురు అమ్మేసి నో స్టాక్ బోర్డులు పెడుతున్నారు. తప్పుడు ప్రచారాలతో అసలే ఆందోళనలో ఉండే ప్రజలు.. ఈ బోర్డులు చూడగానే మరింత భయపడిపోతున్నారు. ఎక్కడైనా బంకులు తెరిచి ఉంటే ఒక్కసారిగా ఎగబడుతున్నారు. క్రెడిట్ పద్ధతితోపాటు ఆర్థిక సంవత్సరం ముగింపు లెక్కలు అందుకు ఇబ్బందికరంగా మారినట్లు చెబుతున్నారు.



## 50 శాతం వాణిజ్య విమానాల్లో సాంకేతిక లోపాలు: స్టాండింగ్ కమిటీ ఆన్ సివిల్ ఏవియేషన్

దేశంలోని 50 శాతం వాణిజ్య విమానాల్లో సాంకేతిక లోపాలు ఉన్నాయని స్టాండింగ్ కమిటీ ఆన్ సివిల్ ఏవియేషన్ తాజాగా వెల్లడించింది. ఏడాదికాలంగా చేపట్టిన తనిఖీల్లో వాటిని గుర్తించినట్లు వెల్లడించింది. తరుచూ అవే సాంకేతిక సమస్యలు వెలుగు చూస్తున్నాయని పేర్కొంది. 2025 జనవరి నుంచి 2026 ఫిబ్రవరి వరకు 754 విమానాల్లో ఆడిట్ నిర్వహించగా 377 వాటిల్లో లోపాలు ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపింది. ఆడిట్ చేసిన వాటిల్లో ఇండిగో విమానాల సంఖ్య ఎక్కువగా ఉందని, లోపాలు కూడా వాటిలోనే అధికంగా ఉన్నట్లు కమిటీ తెలిపింది. ఫిబ్రవరి 3వ తేదీ వరకు 405 విమానాల్లో ఆడిట్ నిర్వహించగా, 148 ఫ్లైట్‌లలో లోపాలు ఉన్నాయని తెలిపింది. కొన్ని లోపాలు రిపీట్ అయినట్లు పేర్కొంది. 166 ఎయిరిండియా, 101 ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానాల్లో తనిఖీలు చేపట్టగా, వాటిలోనూ లోపాలు వెలుగుచూశాయి. దాదాపు సగం లోపాలు ఈ రెండు విమానయాన సంస్థలకు చెందిన వాటిల్లోనే ఉన్నట్లు తెలిపింది. ఈ స్థాయిలో లోపాలు వెలుగుచూడటంపై కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. ఇవి ప్రయాణికుల భద్రత, సంస్థల విశ్వసనీయతపై ప్రభావం చూపిస్తాయని హెచ్చరించింది. గత సంవత్సరం అహ్మదాబాద్ ఎయిరిండియా విమాన ప్రమాదం తర్వాత ఎయిరిండియాపై డీజీసీఏ నిర్వహించిన ఆడిట్‌ను కూడా నివేదిక ప్రస్తావించింది.

## కవిత కొత్త పార్టీకి ముహూర్తం ఖరారు..


### ఏప్రిల్ 25న జెండా ఆవిష్కరణ

నిజామాబాద్, న్యూస్‌వార్ ప్రతినిధి

నూతన రాజకీయ పార్టీపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కీలక ప్రకటన చేశారు. ఏప్రిల్ 25న ఉదయం 10 గంటలకు కొత్త పార్టీని స్థాపించనున్నట్లు తెలిపారు. మేడ్చల్‌లోని మునీరాబాద్ వద్ద అద్వయ ఫంక్షన్ హాలులో జెండా ఆవిష్కరణ చేస్తామని ప్రకటించారు. ఆ సమయంలోనే పార్టీ పేరును కూడా ప్రకటించనున్నట్లు తెలిపారు. కార్యకర్తలంతా సమయానికి చేరుకోవాలని, ప్రతి గ్రామం నుంచి తరలిరావాలని కవిత పిలుపునిచ్చారు. యువతకు, మహిళలకు ప్రాధాన్యం ఇస్తామని వెల్లడించారు. ఆడబిడ్డల్లో మార్పు తేవడానికి ఓ మహిళగా ఈ పార్టీని పెడుతున్నానని తెలిపారు. బీసీ బిల్లు సాధించడం తమ వల్లనే సాధ్యమవుతుందని అన్నారు. బీసీలు, దళితులు, గిరిజనులు, మైనారిటీలు తరలిరావాలని కవిత పిలుపునిచ్చారు. తెలంగాణ రాజకీయాలను శ్రీరాముడి స్ఫూర్తితో గమనించాలని కవిత అన్నారు. 'నేను నిజామాబాద్ బిడ్డను. ఈ మట్టి మంచిది. ఇక్కడి నుంచి తీసుకునే ఏ నిర్ణయమైనా సక్సెస్ అయింది' అన్నారు. గతంలో బీఆర్ఎస్ హయాంలో ఉన్నప్పుడు.. నీళ్లు, నిధులు, నియామకాలు సంపూర్ణంగా సాధించలేకపోయమన్నారు కవిత. రోజు ప్రజల అవస్థలు చూశామని వ్యాఖ్యానించారు. అందుకోసమే ఓ కొత్త రాజకీయ పార్టీ రావాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. అందరూ మెచ్చేలా పార్టీ ఉంటుందని, సర్వోదయ తెలంగాణ రావాలని కవిత కాంక్షించారు. 'మేము ఎవ్వరికీ బీ పార్టీ కాము. మాది నంబర్ వన్ పార్టీ అవుతుంది. శ్రీరాముడి స్ఫూర్తితో, సిద్ధాంతాలను ఆదర్శంగా తీసుకుని పని చేస్తాం. ఎక్కడి నుంచి పోటీ చేయాలనేది పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. 95 శాతం తెలంగాణ ప్రాంతీయ పార్టీగా, ఇంటి పార్టీగా కొత్త పార్టీ రాబోతోంది. అవసరమైతే ఢిల్లీలో లాబీ చేస్తా, గల్లీలో పని చేస్తా' అని కవిత స్పష్టం చేశారు.

## అయోధ్యలో అద్భుతం: బాలరాముడి నుదుటిపై 'సూర్య తిలకం'

అయోధ్య రామమందిరంలో శ్రీరామనవమి వేడుకలు వైభవోపేతంగా జరిగాయి. నూతన ఆలయ ప్రతిష్ఠాపన తర్వాత ఇది రెండవ శ్రీరామనవమి కాగా, ఈ ఉత్సవాల్లో ప్రధాన ఆకర్షణగా 'సూర్య తిలకం' నిలిచింది. సరిగ్గా మధ్యాహ్నం 12 గంటలకు బాలరాముడి విగ్రహం నుదుటిపై సూర్యకిరణాలు నేరుగా ప్రసరించి, అద్భుతమైన తిలకంగా మారాయి. దాదాపు 4 నిమిషాల పాటు ఈ దివ్యమైన దృశ్యం ఆవిష్కృతమవ్వడంతో గర్భగుడి మొత్తం దేదీప్యమానంగా వెలిగిపోయింది. ఈ అద్భుత ఘట్టం వెనుక ఆధునిక విజ్ఞానశాస్త్రం ఉంది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రోఫిజిక్స్ (ఐఐఏ) శాస్త్రవేత్తలు రూపొందించిన ప్రత్యేకమైన అద్దాలు, కటకాల వ్యవస్థ ద్వారా సూర్యకిరణాలను ఆలయం పై అంతస్తు నుంచి నేరుగా గర్భగుడిలోని



విగ్రహంపైకి మళ్లించారు. శ్రీరాముడు సూర్యవంశస్థుడు కావడంతో, ఆయన జన్మదినాన సాక్షాత్తు సూర్యభగవానుడే తిలకం దిద్దినట్లుగా భక్తులు ఈ ఘట్టాన్ని భావిస్తారు. ఈ అద్భుతాన్ని కనులారా వీక్షించేందుకు లక్షలాది మంది భక్తులు అయోధ్యకు తరలివచ్చారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని, ఆలయ అధికారులు నగరం అంతటా పెద్ద ఎల్ఈడీ స్క్రీన్లను ఏర్పాటు చేసి ప్రత్యక్ష ప్రసారం చేశారు. ఈ సందర్భంగా బాలరాముడికి 56 రకాల నైవేద్యాలు సమర్పించారు. ఈ ఏడాది వీఐపీ దర్శనాలను రద్దు చేసి, సామాన్య భక్తులకే ప్రాధాన్యం ఇవ్వడం విశేషం. ఈ సూర్య తిలకం వేడుక కేవలం ఆధ్యాత్మిక ఘట్టంగానే కాకుండా, భారత శాస్త్రవేత్తల సాంకేతిక ప్రతిభకు నిదర్శనంగా నిలిచింది.

## కుప్పకూలిన సూచీలు... భారీ నష్టాలతో ముగిసిన స్టాక్ మార్కెట్లు

దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం భారీ నష్టాల్లో ముగిశాయి. రెండు రోజుల వరుస లాభాలకు బ్రేక్ వేస్తూ సూచీలు కుప్పకూలాయి. మధ్యప్రాచ్యంలో నెలకొన్న అనిశ్చితి ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య జరుగుతున్న చర్చలపై నెలకొన్న ఉత్కంఠతో పెట్టుబడిదారులు అమ్మకాలకు మొగ్గుచూపారు. ఫలితంగా, సెన్సెక్స్ 1,690.25 పాయింట్లు నష్టపోయి 73,583.22 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 486.85 పాయింట్లు క్షీణించి 22,819.60 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ 30 షేర్లలో రిలయన్స్ ఇండస్ట్రీస్ అత్యధికంగా 4.55 శాతం నష్టపోయింది. బజాజ్ ఫైనాన్స్, ఇండిగో, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు కూడా భారీగా పతనమయ్యాయి. అయితే, టీసీఎస్, భారతీ ఎయిర్‌టెల్, పవర్ గ్రిడ్ షేర్లు మాత్రం లాభాల్లో ముగియడం గమనార్హం. రంగాల వారీగా చూస్తే, ఐటీ మినహా అన్ని సూచీలు నష్టాల్లోనే ముగిశాయి. పీఎస్‌యూ బ్యాంకులు, రియాల్టీ, ఆటో షేర్లలో అమ్మకాల ఒత్తిడి ఎక్కువగా కనిపించింది. బ్రాడర్ మార్కెట్లలోనూ ఇదే ట్రెండ్ కొనసాగింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 2.24 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 1.88 శాతం మేర నష్టపోయాయి. ప్రస్తుత మార్కెట్ అనిశ్చితి దృష్ట్యా, సూచీలు పెరిగినప్పుడు అమ్మకాలు జరపడమే మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. నిఫ్టీ 23,500 స్థాయికి చేరినప్పుడు అమ్మకాల ఒత్తిడి ఎదురుకావచ్చుని, ఒకవేళ 22,800 స్థాయిని కోల్పోతే మార్కెట్ మరింత బలహీనపడే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

న్యూస్ వార్
వార్తా పత్రిక

**సంపాదకీయం...**

# చైనా ఉన్నతిని గుర్తిస్తున్న ప్రపంచం

చైనా, యావత్ ప్రపంచ దేశాలూ అసాధారణమైన పరిస్థితులను ఎదుర్కొంటున్న నేపథ్యంలో సి.పి.ఐ(యం) ప్రతినిధి బృందం చైనాలో పర్యటించింది. ఆరుగురు ప్రతినిధులతో కూడిన మా బృందం సెప్టెంబరు 23 నుండి 30 వరకు ఆ దేశ రాజధాని బీజింగ్‌తో పాటు హుబెయీ, ఝెజియాంగ్ ప్రావిన్స్‌లను సందర్శించింది. నేను 40 ఏళ్ళ క్రితం, 1985లో తొలిసారిగా చైనాలో జరిగిన అంతర్జాతీయ యువజన సదస్సుకు హాజరయ్యాను. ఈ శతాబ్దపు తొలి దశాబ్దంలో మరలా చైనాలో అడుగు పెట్టిన నేను ఆ దేశంలో చోటు చేసుకున్న మార్పులు చూసి ఆశ్చర్యపోయాను. బీజింగ్‌లోని తియాన్మెన్ స్క్వేర్‌లో 'నేషనల్ సెంటర్ ఫర్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్' (జాతీయ కళా ప్రదర్శనా వేదిక) పేరిట భూగర్భంలో నిర్మించిన సాంస్కృతిక రంగస్థల సమాహార వేదిక ఆసియాలోనే అతి భారీ కట్టడంగా పేరొందింది. స్థానికంగా ఈ కాంప్లెక్స్‌ను 'జెయింట్ ఎగ్'గా పిలుచుకుంటారు. అద్భుతమైన శిల్ప కళా నైపుణ్యంతో నిర్మించిన ఈ కాంప్లెక్స్‌లో ఒకేసారి నాలుగైదు భారీ ఇవెంట్లు నిర్వహించుకోవచ్చు. మౌళిక సౌకర్యాల అభివృద్ధిలోని సృజనాత్మకత, సాంస్కృతిక వైభవాలకు ఇది అద్దం పడుతుంది. గతంలో పర్యటించి నప్పుడు ఇక్కడ చుట్టు పక్కల పరికిస్తూ ఉండిపోయాను.

ఈసారి మాత్రం వయోలిన్, గిటార్‌ల వీనుల విందైన కచేరీని అస్వాదించాం. 2021 నాటికి చైనా కమ్యూనిస్టు పార్టీ ఏర్పడి వందేళ్ళు అయ్యింది. ఈ శత వార్షిక సంబరాల్లో భాగంగా చైనా కమ్యూనిస్టు పార్టీ అమలు చేసిన భారీ ప్రజా సంక్షేమ కార్యక్రమాన్ని యావత్ ప్రపంచం ఆసక్తిగా గమనిస్తున్నది. ప్రపంచబ్యాంకు నిర్వచనం ప్రకారం దారిద్యరేఖకు దిగువన ఉన్న 80 కోట్ల ప్రజానీకాన్ని చైనా పైకి తీసుకు వచ్చింది. ఈ స్ఫూర్తితోనే కేరళలో సి.పి.ఐ(యం) నాయకత్వాన ఉన్న వామపక్ష ప్రజాతంత్ర ప్రభుత్వం కూడా దుర్భర దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న ప్రజలను పైకి తీసుకురావడానికి వివిధ అభ్యుదయ కార్యక్రమాలను అమలు చేసిన తీరును గుర్తు చేసుకోవడం సందర్భోచితమని భావిస్తున్నాను. ఈ ఏడాది నవంబర్ నాటికి మన దేశంలో దుర్భర పేదరికాన్ని నిర్మూలించిన తొలి రాష్ట్రంగా కేరళ నిలుస్తుంది. చైనా కమ్యూనిస్టు పార్టీ శత వార్షికోత్సవాల సందర్భంగా ఈ ఏడాది జులై 15న బీజింగ్‌లో ఒక మ్యూజియమ్ ఏర్పాటు చేశారు. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో ఒక దేశ చరిత్రను, పార్టీ చరిత్రను సునిశితంగా ఎలా ప్రదర్శించవచ్చనే దానికి మ్యూజియమ్‌ను ఒక ఉదాహరణగా చెప్పుకోవచ్చు. చైనా కమ్యూనిస్టు పార్టీ ఏర్పడిన కాలం నుండి ఆధునిక కాలం వరకూ వందేళ్ళ సుదీర్ఘ ప్రయాణంలో సాధించిన విజయాలను కళ్ళకు కట్టినట్లు డిజిటల్ రూపంలో ప్రదర్శించారు. చైనాను సామ్రాజ్యావాద, వలస పాలన నుండి విముక్తి చేసేందుకు సాగించిన పోరాటాన్ని, వివిధ దశలలో అనుసరించిన



వ్యూహాలను, ఎత్తుగడలను ఆది నుండి తుది వరకు సచిత్ర రూపంలో ప్రదర్శించారు. మావో జెడాంగ్ నాయకత్వం కుమింటాంగ్‌తో పొత్తు, 1927 తర్వాతి కాలం నాటి చీలిక, పోరాటాలు, లాంగ్ మార్చ్, ఆశేష త్యాగాలు, సమరశీల పోరాటాల ద్వారా సాధించిన విప్లవ విజయం, డెంగ్ జియావో పింగ్ నాయకత్వాన చేపట్టిన ఆధునీకరణ చర్యలు, జియాంగ్ జెమిన్, హుజింటావో నాయకత్వాన కొనసాగిన ఆధునీకరణ పర్వం, 2012 నుండి సీ జిన్‌పింగ్ నాయకత్వాన పార్టీ, దేశం పురోగమిస్తున్న వర్తమాన దశను ఇందులో పొందుపరిచారు. ఈ మ్యూజియంలో 4,548 వస్తువులను ప్రదర్శనకు ఉంచారు. కార్ల్‌మార్క్స్ బ్రసెల్స్ నోట్‌బుక్, చైనా రిపబ్లిక్‌ను ప్రకటించిన రోజున మావో ధరించిన కోటు, టోపీ, మావో చేతి రాత ప్రతులు, కమ్యూనిస్టు ప్రణాళికను చెన్ వాంగ్టూ చైనా భాషలోకి అనువదించిన ప్రతి, లాంగ్ మార్చ్ సందర్భంగా ధరించిన బెల్ట్‌లు, చైనా సైన్యం అమెరికా 31వ పదాతి దళాన్ని ఓడించి కైవసం చేసుకున్న అమెరికన్ జాతీయ జెండా వంటివి చూశాం. మా పర్యటన సందర్భంగా అనేక ద్వైపాక్షిక చర్యలు చోటు చేసుకున్నాయి. అన్నింటిలోకి చైనా కమ్యూనిస్టు పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు 'లీ షులేరు' నాయకత్వాన ఉన్న ప్రతినిధి బృందంతో సాగిన చర్యలు ప్రముఖమైనవి. చైనా కమ్యూనిస్టు పార్టీ సి.పి.ఐ.(యం), ఇరు పార్టీల మధ్య ఉన్న దీర్ఘకాలిక ధృఢ సంబంధాలను కొనసాగించాలన్న అభిప్రాయం ఈ చర్చల్లో వచ్చింది. ట్రంప్ అధ్యక్షతన అమెరికా ప్రపంచ దేశాల మీద, ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దక్షిణాది దేశాల మీద తన ఆధిపత్యాన్ని రుద్దడానికి సాగిస్తున్న ప్రయత్నాలను ఇరు పార్టీలూ గమనంలో ఉంచుకుని, ఈ ప్రయత్నాలను నిలవరించడానికి భుజం భుజం కలిపి నిలబడాలన్న ఏకాభిప్రాయానికి వచ్చాయి. ఈ సందర్భంగా తియాంజిన్‌లో జరిగిన షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్స్ సదస్సుకు భారత ప్రధాని నరేంద్ర మోడీ హాజరైన విషయాన్ని గమనంలోకి తీసుకున్నది. భారత్ %-% చైనా దేశాల మధ్య రాయబార సంబంధాలు నెలకొని 75 ఏళ్లు కావొస్తున్న సందర్భం ఇది. షాంఘై కోఆపరేషన్ వేదికతో పాటు బ్రిక్స్ కూటమిలో కూడా రెండు దేశాలూ వాటి వంతు పాత్ర పోషిస్తున్నాయి. రాబోయే కాలంలో భారత్, చైనాలు వంతుల వారీగా బ్రిక్స్ అధ్యక్ష స్థానాన్ని నిర్వహించనున్నాయి. భారత్ %-% చైనాలు చర్చల ద్వారా రెండు దేశాల మధ్య నెలకొన్న సమస్యలు పరిష్కరించుకోవాలని చైనా కమ్యూనిస్టు పార్టీ సిపిఐ(ఎం) ప్రతినిధి బృందాలు అభిప్రాయపడ్డాయి. రెండు దేశాల మధ్య సంబంధాలు మెరుగుపడడం ఇరు దేశాలకూ లాభదాయకం కావడంతో పాటు ప్రపంచ శాంతికి, ఆర్థిక ప్రగతికి తోడ్పడుతుంది

# అమరావతి తీర్మానం ఓ డ్రామా

**ప్రజలను మభ్య పెట్టే ఎత్తుగడ**
**రైతులను నిండా ముంచి మభ్య పెట్టారు**
**అవినీతి నుంచి ప్రజల దృష్టి మళ్లించే యత్నం**
**అసెంబ్లీ తీర్మానం సరే..మండలిలో ఎందుకు చేయడం లేదు**
**మీడియా సమావేశంలో తీవ్ర విమర్శలు చేసిన వైసిపి నేత సజ్జల**

**అమరావతి**

అమరావతి కోసం అసెంబ్లీలో తీర్మానం అన్నది చంద్రబాబు డ్రామా అని వైఎస్సార్‌సీపీ స్టేట్ కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి విమర్శించారు. ఇది ప్రజలను మభ్యపెట్టడానికి చేస్తున్న ఎత్తుగడ అని సజ్జల ధ్వజమెత్తారు. అమరావతి కోసం అసెంబ్లీలో చంద్రబాబు తీర్మానం పెట్టడంపై సజ్జల అనేక ప్రశ్నలు సంధించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అమరావతి పేరిట అవినీతి నుంచి, రైతులకు పరిష్కారం కాని అంశాల నుంచి పక్కదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారు. అమరావతి కోసం అసెంబ్లీలో తీర్మానం చేయాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చింది? , ఎవరు అభ్యంతరం చెప్పారు, ఎవరు అడ్డంకులు చెప్పారన్న దానికి చంద్రబాబు వివరణ ఇవ్వాలన్నారు. అసెంబ్లీలో తీర్మానం చేసి, అంతా చేసేశానని చంద్రబాబు చెప్పుకోవాలని అనుకుంటున్నారు. అసెంబ్లీతో పాటు, మండలిని కూడా సమావేశపరచాలి కదా?, కానీ, అమరావతి లో చంద్రబాబు అవినీతి, వ్యవహరిస్తున్న తీరును ప్రశ్నిస్తారనే మండలిని పిలవటం లేదా అని నిలదీసారు. శాశ్వత రాజధానిని నిర్మించి, ప్రజలకు వేగంగా అందుబాటులోకి తీసుకురావాలన్న ఆలోచన చంద్రబాబు ఎప్పుడూ చేయలేదు, అలాకాకుండా రాజధాని అంశాన్ని శాశ్వత కామధేనువుగా మార్చాడు, అమరావతిలో చంద్రబాబు అవినీతి యజ్ఞం చేస్తున్నారు' అని సజ్జల మండిపడ్డారు. ాజధాని విషయంలో చంద్రబాబుకు ఆచరాణాత్మక ధోరణి ఇప్పటికీ లేదు. వైఎస్సార్‌సీపీ అభివృద్ధి వికేంద్రీకరణలో అమరావతికీ స్థానం ఉంది, అయితే ఇదంతా గతంలో జరిగిన పరిణామాలు. ఇప్పుడు మళ్లీ చంద్రబాబు అధికారంలోకి వచ్చారు, వచ్చాక కూడా ఏమీ చేయడం లేదు. చంద్రబాబు ఊహాజనిత రాజధాని, దానికయ్యే ఖర్చు ఎంత అవుతుంది అన్నదానిపై మేం ప్రశ్నలు వేశాం. అంతే తప్ప అమరావతి ప్రాంతానికి ఎప్పుడూ జగన్ వ్యతిరేకం కాదు. అందుకనే 2019లో అధికారంలోకి రాకముందే జగన్ ఇక్కడ ఇల్లు కట్టుకున్నారు. అమరావతి ప్రాంతానికి వైఎస్సార్‌సీపీ ఆ రోజూకాని, ఈ రోజుకాని ఎప్పుడూ అభ్యంతరం చెప్పలేదు. మేం అభ్యంతరం వ్యక్తం చేసేది అవినీతి మీద, దోపిడీ మీద. రైతుల సమస్యలను ఇప్పటికీ పరిష్కరించలేదు. పిల్లల పెళ్లిళ్లు కూడా రైతులు చేయలేకపోతున్నారు. చంద్రబాబు ప్రణాళిక ప్రకారం కనీస మౌలిక సదుపాయాల కోసం రూ.2 లక్షల కోట్లు కావాలి. 2014-19లో ఐదేళ్లలో ఖర్చు చేసింది రూ.5వేల కోట్లే. ఇప్పుడు కూడా చేసింది ఏమీ లేదు. ఇప్పుడు చదరపు అడుగుకు రూ.19వేల వరకూ పెంచారు. అమరావతిలో పాత బిల్డింగులు కాక, ఈ రెండేళ్లలో కొత్తగా కట్టారా?, మళ్లీ డిజైన్ల పేరిట రూ.400 కోట్లు ఖర్చుచేస్తున్నారు. 2018లో టెండర్లు ఖరారై, పనులు ప్రాంభమైన వాటికి కూడా మళ్లీ టెండర్లు పిలిచారు. కాంట్రాక్టర్లతో గూడు పుఠానీ చేశారు. అందరికీ 4శాతం కంటే ఎక్కువ టెండర్లు ఖర్చు పెట్టారు. చంద్రబాబు తీరును చూసి, అమరావతి పేరిట చేసిన దోపిడీని



చూసి రాష్ట్రం భయపడతోంది. చంద్రబాబు సృష్టించిన అవినీతి ఊబిలో రాష్ట్రం ఎక్కడకు పోతుందో తెలియడంలేదు. ప్రజల సొమ్ము, రాష్ట్ర వనరులను పీల్చి పిప్పిచేస్తున్నారు. ప్రజల భవిష్యత్తును, రాష్ట్ర భవిష్యత్తును చీకట్లో పెడుతున్నారు. అమరావతి గురించి ఆర్టీఐ కింద ప్రశ్నలు వేసినా సమాచారం ఇవ్వడంలేదు. అమరావతి పనుల్లో ఎక్కడా పారదర్శకత లేదు. ఈ విడతలో రూ.9వేలకోట్లు తెచ్చి, రూ.5వేల కోట్లు మొబలైజేషన్ అడ్వాన్స్‌లు ఇచ్చారు. సుమారు 47వేల కోట్లకు శాంక్షన్లు ఇచ్చారు. దీనిపై ఎవరైనా ప్రశ్నిస్తే.. అమరావతికి వ్యతిరేకం అని ముద్ర వేస్తున్నారు. ాజధాని ప్రాంతానికి కనెక్టివిటీకోసం ఏమైనా చేశారా?, ఇప్పటికీ కరకట్ట రోడ్డే కదా గతి. వచ్చినా వెస్ట్రన్ బైపాస్ కూడా పూర్తిచేసింది వైఎస్సార్‌సీపీ హయాంలోనే కదా. పనులు ఏమీ చేయకపోయినా, ప్రజలను నిరంతరం భ్రమల్లో పెట్టాలన్నదే చంద్రబాబు ప్లాన్. మొదటి రోజు నుంచి ఇప్పటివరకూ అమరావతి విషయంలో వివరాలు ప్రభుత్వం బయటపెట్టగలదా?, మొదటి విడత భూములు తీసుకున్న రైతులకే ఏమీ చేయలేదు. కాని, రెండో విడత అంటూ మళ్లీ వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారు. అమరావతిలో జోరుగా జరుగుతున్న పనులు కేవలం చంద్రబాబు ఇల్లు మాత్రమే. అమరావతి పేరుమీ అప్పులు తెస్తున్నారు, మొబలైజేషన్ అడ్వాన్స్‌లు ఇస్తున్నారు, కమీషన్లు కొట్టేస్తున్నారు. రైతులకు ఇచ్చిన ప్లాట్లను ఎందుకు అభివృద్ధి చేయడం లేదు?, దీనికి ఎవరు అడ్డుపడ్డారు.

చెరువుల్లో కూడా రైతులకు ప్లాట్లు ఇచ్చి వారిని నట్టేటా ముంచారు. ఎవరైనా దీన్ని ప్రశ్నిస్తే.. మళ్లీ వారిమీద ముద్ర వేసే ప్రయత్నం చేస్తున్నారు. చంద్రబాబుకు ఇన్‌కంట్యాక్స్ నోటీసులు అమరావతి పనుల కమీషన్లకు సంబంధించే వచ్చాయి. రూ.2వేల కోట్ల అవినీతిపై ఆరోజు ఇన్‌కంట్యాక్స్ నోటీసులు వచ్చాయి. చంద్రబాబు పీఏ శ్రీనివాస్‌కు కమీషన్లు, లంచాలు వెళ్లాయని ఆ నోటీసుల్లో ఉంది. ఈ నోటీసులపై విచారణ ఆగిపోయింది. అమరావతిలో చంద్రబాబు అవినీతికి నిదర్శనానికి ఈ నోటీసులే. అమరావతి నిర్మాణాలు, అంచనాలు, అప్పులు చూస్తే ప్రజల గుండెలు అదిరిపోతున్నాయి. సెల్ఫ్ ఫైనాన్స్ సిటీ అంటూనే అప్పులు చేస్తున్నారు. అమరావతిలో చంద్రబాబు. కట్టాలనుకుంటున్న భవనాల నిర్వహణ ఖర్చులు వింటేనే ప్రజలకు భయం వేస్తోంది. ఆచరాణాత్మకంగా, వాస్తవిక దృక్పథంతో చంద్రబాబు ఆలోచన లేదు. పనులు కన్నా, భ్రమలను కలిగించడమే చంద్రబాబు ఉద్దేశం. చంద్రబాబు గతంలో చెప్పిన హైపర్ లూప్ ఏమయ్యింది?, అమరావతిలో ఒలింపిక్స్ ఏమయ్యాయి?' అని సజ్జల ప్రశ్నించారు. అమరావతి పేరుతో రైతుల సమస్యల్ని పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. అమరావతి కోసం అసెంబ్లీలో తీర్మానం అన్నది చంద్రబాబు డ్రామా అని విమర్శించారు. అందుకే 2019 లో అధికారంలోకి రాకముందే మాజీ సిఎం వైసిపి జగన్ మోహన్ రెడ్డి ఇక్కడ ఇల్లు కట్టుకున్నారని తెలియజేశారు. అమరావతి కోసం తీర్మానం చేయాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చింది? అని ప్రశ్నించారు. అసెంబ్లీతో పాటు, మండలిని కూడా సమావేశపరచాలని కదా? అని అన్నారు. రాజధాని పేరుతో చంద్రబాబు చేస్తున్న దోపిడీపైనే వైసిపి అభ్యంతరం చెప్పింది అని అన్నారు. ప్రజల్ని మభ్య పెట్టడానికి ప్రభుత్వం చేస్తున్న ఎత్తుగడ అని సజ్జల రామకృష్ణారెడ్డి మండిపడ్డారు.

# ఏపి కేబినేట్ కీలక నిర్ణయాలు

**రాష్ట్ర రాజధానిగా అమరావతిని కొనసాగిస్తూ తీర్మానం**
**కొత్త రాజధాని స్థానంలో అమరావతి పేరును చేర్చాలని నిర్ణయం**
**96 జూనియర్, సీనియర్ సివిల్ జడ్జిల కోర్టుల ఏర్పాటు**
**వడ్డెర సంఘాలకు ప్రాధాన్యక్రమంలో ఖనిజ లీజులు**
**ఆస్తి పన్ను బకాయిలపై వడ్డీ మాఫీ**

**అమరావతి**

రాజధాని అమరావతి అంశంపై ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసింది. రాష్ట్ర రాజధానిగా అమరావతిని కొనసాగిస్తూ, దానికి పూర్తిస్థాయిలో చట్టబద్ధత కల్పించేలా మంత్రివర్గం కీలక తీర్మానం చేసింది. గత కొంతకాలంగా సాగుతున్న న్యాయ, పరిపాలన పరమైన చిక్కులను తొలగించి, అమరావతి నిర్మాణ పనులను వేగవంతం చేసే దిశగా ఈ నిర్ణయం తీసుకున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ముగిసింది. ఈ భేటీలో రాష్ట్ర అభివృద్ధి, పాలనపరమైన అంశాలపై చర్చించి పలు కీలక నిర్ణయాలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఏపీ పునర్విభజన చట్టం 2014లోని సెక్షన్-5ను సవరించాల్సిందిగా మంత్రివర్గం తీర్మానం చేసింది. కొత్త రాజధాని స్థానంలో అమరావతి పేరును చేర్చాలని ప్రభుత్వం భావిస్తోంది. అంతేకాకుండా నీరుకొండలో ఎస్ఆర్ఎం వర్సిటీ, 60 మీటర్ల ఎత్తు వరకు అకడమిక్ భవనాల నిర్మాణానికి క్యాబినెట్ అనుమతి ఇచ్చింది. అలాగే రాష్ట్రంలో 96 జూనియర్, సీనియర్ సివిల్ జడ్జిల కోర్టుల ఏర్పాటుకు ఆమోదం ఇచ్చింది. వడ్డెర సంఘాలకు ప్రాధాన్యక్రమంలో ఖనిజ లీజుల కేటాయింపులపై చర్చించారు. ఖనిజ లీజుల కేటాయింపులో ప్రీమియం, సీనరేజ్ ఫీజుల్లో 50శాతం రాయితీ ఇవ్వనున్నారు. కుప్పం బాలికల పాఠశాలలో పీఈటీ, నర్సు, రికార్డు అసిస్టెంట్ పోస్టుల మంజూరుకు ఆమోదం ఇచ్చింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఆస్తి పన్ను బకాయిలపై వడ్డీ మాఫీ చేసింది. జలవనరుల శాఖలో వివిధ ప్రాజెక్టుల ఆధునికీకరణ, మరమ్మతులకు పరిపాలన అనుమతులు ఇచ్చారు. వివిధ సంస్థలకు భూ కేటాయింపులపై రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకున్నది. ఎలక్ట్రిక్ ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని మంత్రి వర్గం నిర్ణయించింది. కొత్త రాజధానిగా సీఆర్డీఏ చట్టం పరిధిలోని అమరావతి పేరు చేర్చాలని క్యాబినెట్ తీర్మానించింది. 28న అసెంబ్లీలో 4 గంటలపాటు చర్చించి తీర్మానించాలని నిర్ణయించింది. రాజధాని చరిత్రను ప్రజలకు తెలియ జేయాలని సీఎం చంద్రబాబు క్యాబినెట్‌కు సూచించారు. క్యాబినెట్ సమావేశంలో భాగంగా విద్యుత్ వ్యవస్థపై ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఏప్రిల్ 5 నుంచి 14 లోపు ప్రతి నియోజకవర్గంలో 2 వేల చొప్పున సూర్యఘర్ కనెక్షన్లు ఇవ్వాలని నిర్ణయించారు. పీఎం కుసుమ్ ద్వారా పవర్ లాస్‌లు తగ్గించేలా చూడాలని దిశానిర్దేశర చేశారు. బ్యాటరీ స్టోరేజ్ వ్యవస్థల్ని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ల వద్ద ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సాంకేతికత అందిపుచ్చుకుంటూ సంస్కరణలు తీసుకొస్తూ విద్యుత్‌శాఖ ముందుకెళ్లాలని సూచించారు. ఆదాయంలో 99శాతం జీతాలకే సరిపోతోంది. కేంద్ర సాయం అప్పులు, వడ్డీలు కట్టేందుకే సరిపోతోంది. క్లిష్టపరిస్థితు ల్లోనూ సంక్షేమం అందిస్తూ అభివృద్ధి దిశగా నడిపిస్తున్నాం. కేంద్ర పథకాలను ఎక్కువగా మనం ఉపయోగించుకుంటున్నాం. ఈ పార్లమెంట్ భేటీలోనే రాజధానిగా అమరావతి చట్టబద్ధత సవరణ బిల్లు పెడతారు' అని సీఎం చంద్రబాబు అన్నారు.





న్యూస్ వార్
వార్తా పత్రిక

# అన్నిటాతానై నిలిచే సేవాదళ్

### న్యూస్ వార్ భేటీలో - జిల్లా కార్యదర్శి రాజేంద్ర ప్రసాద్ రావిరాల

కాంగ్రెస్ పార్టీలోని అతి ముఖ్యమైన అనుబంధ సంస్థల్లో కాంగ్రెస్ సేవాదళ్ ప్రధానమైనదని. క్రమశిక్షణతో కూడిన వాలంటీర్ల దళాన్ని రూపొందించడమే లక్ష్యంగా ఇది స్థాపించబడిందని ఆ పార్టీ సేవాదళ్ జిల్ల కార్యదర్శి రావిరాల రాజేంద్ర ప్రసాద్ నేత అన్నారు ఈనాడు కాంగ్రెస్ పార్టీలో సేవాదల్ గా పిలవబడుతున్న సంస్థా మొదటిసారిగా 1923 లో జరిగిన కాకినాడ కాంగ్రెస్ మహాసభలో బ్రిటిష్ వారిపై పోరాడుతున్న కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేస్తున్న సమయంలోను వారిని జైల్లో పెట్టిన సమయంలోనూ వారి తరఫున పోరాడేందుకు ఒక యువజన సంస్థ ఉండాలనేటటువంటి ఉద్దేశంతో శ్రీమతి సరోజినీ నాయుడు హిందుస్థాని సేవాదళ్ పేరిట కొంతమంది యువకులతో ఈ సేవాదళ్ ను ఏర్పాటు చేశారని తెలిపారు. అనంతరం డిసెంబర్ 28న కాంగ్రెస్ నాయకుడు అయినటువంటి నారాయణ సుబ్బారావు హర్డికర్ ఈ సంస్థ పేరును కాంగ్రెస్ సేవాదళ్ గా మార్చారని తెలిపారు స్వాతంత్ర్య పోరాటంలోని శాసనోల్లంఘన ఉద్యమం మరియు క్విట్ ఇండియా ఉద్యమంలో సేవాదళ్ సభ్యులు ముందుండి పోరాడారు. వీరు ఊరేగింపులు నిర్వహించడం, ధర్నాలు చేయడం మరియు ప్రజలను



చైతన్యపరచడంలో కీలకంగా ఉండేవారు. స్వాతంత్ర ఉద్యమ సమయంలో సేవాదళ్ కీలక పాత్ర పోషించటంతో ఈ సంస్థ ప్రభావాన్ని గమనించిన బ్రిటిష్ ప్రభుత్వం 1932లో దీనిపై నిషేధం విధించింది. తెలిపారు. బ్రిటిష్ ప్రభుత్వం కాంగ్రెస్‌పై నిషేధం ఎత్తివేసిన తర్వాత కూడా సేవాదళ్‌పై నిషేధాన్ని కొంతకాలం కొనసాగించారు దీనిని బట్టి సేవాదాలు ఎంత చురుకుగా స్వాతంత్ర పోరాటంలో పాల్గొన్నదో మనం అర్థం చేసుకోవచ్చని తెలిపారు. నేటికీ కూడా కాంగ్రెస్ పార్టీలో సేవాద కీలక పాత్రను పోషిస్తుందని తెలియజేశారు. సేవాదళ్ నుంచి వచ్చిన కార్యకర్తలేందరో యావత్ భారత దేశంలో కాంగ్రెస్ పార్టీ తరఫున ముఖ్యమంత్రులుగా, మంత్రివర్గ సభ్యులుగా పనిచేస్తూ తమ సేవలను దేశానికి, పార్టీకి అందిస్తున్నారని తెలియజేశారు. సేవాదళ్ కార్యకర్తలకు ప్రతినిత్యం ఆరోగ్యపరమైన శారీరక శిక్షణ మరియు దేశభక్తిని పెంపొందించే శిక్షణను ఇవ్వటం చేస్తుందని, సేవాదళ్ సభ్యులు స్వచ్ఛతకు మారురూపమైనటువంటి తెలుపు రంగు యూనిఫాం మరియు గాంధీ టోపీ ధరించడం ద్వారా ప్రత్యేక గుర్తింపు కలిగి ఉంటారని తెలియజేశారు. 1924 లో సేవాదళ్ శతాబ్ది ఉత్సవాలను ఎంతో ఘనంగా నిర్వహించుకుందని 100 సంవత్సరాలు గడిచినప్పటికిని ప్రారంభించిన నాటికంటే దినదిన ప్రవనర్థ మానం చెందుతూ సమాజంలో ఒక ప్రత్యేక గుర్తింపును పొందుతూ పార్టీలోని అన్ని విభాగాల్లో చురుకైన పాత్రను పోషిస్తూ సేవాదళ్ పనిచేస్తుందని ఈ సేవాదళ్ కు మొదటి అధ్యక్షుడిగా మన మొదటి ప్రధాని అయిన జవహర్‌లాల్ నెహ్రూనే వ్యవహరించారని, సేవాదళ్ లో మహిళా విభాగాం కూడ ఉందని వారు కూడా తమతో పాటు అనే సేవా కార్యక్రమాలు పాలుపంచుకుంటారని తెలియజేశారు నేడు ప్రభుత్వం చేపడుతున్న అనేక సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లడం లోను అలాగే ఎలక్షన్లలో పార్టీ గెలుపు కోసం పాటుపడటంలోనూ ప్రకృతి విపత్తులు సంభవించిన సమయంలో సేవా కార్యక్రమాల్లోనూ పార్టీ సమావేశాలు సభలు జరిగినప్పుడు వాటి నిర్వహణ కార్యక్రమాల్లో క్రియాశీలకంగా పని చేయడంలో సేవాదళ్ సభ్యుల పాత్ర అమోఘమైనదని వారు తెలియజేశారు.

# కన్నుల పండుగగా చండూరు రామాలయంలో కళ్యాణం

**న్యూస్ వార్ చండూర్ మార్చి 27**

స్థానిక సీతారామస్వామి దేవాలయంలో వేద పండితులు శ్రీమాన్ కందాళ వెంకట నరసింహచార్యులు, శ్రీనివాసాచార్యులు మరియు శ్రీమాన్ ఆచార్యుల వేదమంత్రోచ్ఛరణల మధ్య ఈరోజు ఉదయం రాములవారి కల్యాణోత్సవం అత్యంత వైభవోపేతంగా జరిగింది. భద్రాద్రిని తలపించేలా జరిగిన ఈ కళ్యాణోత్సవానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై తిలకించారు. అనంతరం భక్తులందరికీ అన్నప్రసాదవితరణ చేయబడింది. ఈ కార్యక్రమం చిలుకూరు అశోక్, రావిరాల శ్రీను, దుస్స గణేష్, కర్నాటి శ్రీనివాస్, రావిరాల ఓంకారం, రాజేష్ ఖన్నా, చిలుకూరు శేఖర్, గంజి నరసింహ, పలస నరసింహ, నాగరాజు ఆర్థిక సహకారం అందిచారు.





# తంగడపల్లి శ్రీరామనవమి వేడుకల్లో చలమల్ల

**న్యూస్ వార్ చౌటుప్పల్ మార్చి 27:**

తంగడపల్లి గ్రామంలో జరిగిన శ్రీరామనవమి వేడుకలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు చలమల్ల కృష్ణారెడ్డి అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్లు కొయ్యడ శేఖర్ గౌడ్, ఊదరి యాదయ్య, గడ్డం ఇందిరా రాజరత్నం, ఆలే శ్రీలత చిరంజీవి, మాజీ సర్పంచ్ ముటుకుల్లోజు దయాకర చారి, మాజీ కౌన్సిలర్ ఆలే నాగరాజు, మాజీ ఎంపిటిసి గ్యార కృష్ణ, శ్రీరామ నవమి ఉత్సవ కమిటీ అధ్యక్షులు సిలివేరు నరసింహ, ఉపాధ్యక్షులు అంతటి బాలరాజు గౌడ్, ఇప్ప వెంకటేశం, ప్రధాన కార్యదర్శి కేతరాజు శ్రీకాంత్, కార్యదర్శి చికూరి సాయి, సహాయ కార్యదర్శి, చంద్రకాంత్, కోశాధికారి గుండెబోయిన వేణు యాదవ్, గౌరవాధ్యక్షులు కెతరాజు అచ్చయ్య, సద్గుణాచారి, మరియు నాయకులు ముసుకు శ్యాంసుందర్ రెడ్డి, ,ఏదుళ్ళ అరవింద్ రెడ్డి, నరేందర్ రెడ్డి, వేణు రెడ్డి నవీన్ రెడ్డి,బోడ్డు ముత్యం, శ్రీను, పోలోజు గోవిందా చారి, బాలగోని వెంకటేశం, ముస్కు రాజేశ్వర్ రెడ్డి, చీకూరి ఇదయ్య, రావుల స్వామి, కందుల వెంకటేశం, జనగాం సురేష్, లింగస్వామి, డాకోజు వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.



## లావణ్య డయాగ్నటిక్ సెంటర్ ను ప్రారంభించిన మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి దంపతులు



**న్యూస్ వార్ చౌటుప్పల్ మార్చి 27:**

చౌటుప్పల్ పట్టణంలో కొండూరు రోడ్లో నూతనంగా ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి సతీసమేతంగా ప్రారంభిస్తూ ఆధునిక వైద్య సౌకర్యాలతో ప్రజలకు అందుబాటులో ఏర్పాటు చేయడం వలన ప్రజల అవసరాలకు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో అబ్బు రాజు గౌడ్ చిలుకూరి ప్రభాకర్ రెడ్డి మోగుదాల రమేష్ లావణ్య డయాగ్నటిక్ సెంటర్ డైరెక్టర్ బైరు శివకుమార్ మొదలైన వారు పాల్గొన్నారు.

# పలుచోట్ల శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొన్న ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి

### నేలకొండపల్లి భక్త రామదాసు ధ్యాన మందిరంలో శ్రీ సీతారాముల కళ్యాణోత్సవానికి హాజరై, పలుచోట్ల అన్నదానం కార్యక్రమాలు ప్రారంభించిన రామ సహాయం


### పాల్గొన్న మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి, తదితర నాయకులు



ఖమ్మం/నేలకొండపల్లి: శ్రీరామనవమి సందర్భంగా ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి జిల్లాలో పలు ప్రాంతాల్లో శుక్రవారం నిర్వహించిన వేడుకల్లో పాల్గొని భక్తులతో కలిసి పూజలు నిర్వహించారు. ఖమ్మం నగరంలో..: శ్రీనగర్ కాలనీ 7, 18 డివిజన్లలో, సాయి గణేష్ నగర్‌లలో జరిగిన వేడుకల్లో రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డితో కలిసి హాజరై పూజల్లో పాల్గొన్నారు. నేలకొండపల్లిలోని ప్రసిద్ధ భక్త రామదాసు ధ్యాన మందిరంలో.. జరిగిన శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవానికి హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొని సీతారాములకు మంగళ హారతులు సమర్పించారు. ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య కార్యక్రమాన్ని నిర్వహించగా, ఎంపీ భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించి భక్తులకు స్వయంగా ప్రసాదాన్ని అందజేశారు. పిల్లలు, మహిళలు, వృద్ధులతో మమేకమై వారికి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. నేలకొండపల్లి మండలం కొత్త కొత్తూరు, నాచేపల్లి, మంగాపురం గ్రామాల్లో నిర్వహించిన శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొని, అన్నదానాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ..: భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఇటువంటి పండుగలు సమాజంలో ఐక్యత, భక్తి భావాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు.

**రెండు కుటుంబాలకు ఎంపీ పరామర్శ:**

నేలకొండపల్లి మాజీ సర్పంచ్ వంగవీటి నాగేశ్వరరావుకు ఇటీవల మోకాలి ఆపరేషన్ జరగగా.. ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి శుక్రవారం వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్యం వివరాలు తెలుసుకొని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అలాగే.. కాంగ్రెస్ సీనియర్ నాయకులు వాకా శ్రీనాథ్ తండ్రి వాకా రంగయ్య ఇటీవల మరణించగా.. ఎంపీ వారి కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమాల్లో...: ఎదులాపురం మున్సిపల్ చైర్ పర్సన్ పోకబత్తిన అనిత, కార్పొరేటర్ నీరజ, కౌన్సిలర్ వెంకటరెడ్డి, మార్కెట్ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, మాజీ చైర్మన్ శాఖమూరి రమేష్, నాయకులు కొడాలి గోవిందరావు, కొప్పుల చంద్రశేఖర్, నెల్లూరి భద్రయ్య, మామిడి వెంకన్న, బొడ్డు బొందయ్య, టీపీసి సభ్యులు ఉమ్మినేని కృష్ణ, ఇమామ్ భాయ్, రంజిత్ నాయక్, విప్లవ్, ఎనగండ్ల నాగేశ్వరరావు, తిప్పిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, రాధాకృష్ణ, అయోధ్య, నాగ ప్రసాద్, పలువురు సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



Edited, Printed, Published & Owned by NATAVA KRISHNA RAO, Published from: Krishna Publications, 10-74, Main Road, Chandoor, (Post &Mandal) Nalgonda 508 255, Telangana, Printed at: Krishna Publications, 10-74, Main Road, Chandoor, (Post &Mandal) Nalgonda 508 255,Telangana, Editor:NATAVA KRISHNA RAO, Cell: 9440991979,